సాక్షి
హనుమకొండ
బుధవారం । 3 । మే । 2023



పోలీస్‌శాఖలో విషాదఛాయలు

పోలీస్ శాఖ ఉన్నతాధికారులకు ఎస్కార్ట్‌గా వెళ్తున్న క్రమంలో పోలీసు వాహనం బోల్తా పడటంతో సెకండ్ ఎస్సై, డ్రైవర్ మృతి చెందారు. - 8లో▸



అప్రమత్తంగా ఉండాలి

అకాల వర్షాలతో అధికారులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు సూచించారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
34^0/23^0

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఎండ మామూలుగా ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. పలు చోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

విద్యారణ్యపురి: సెంట్రల్ యూనివర్సిటీలు సంయుక్తంగా నిర్వహించే జాతీయస్థాయి సీయూఈటీ, తెలంగాణలోని అన్ని యూనివర్సిటీల్లో సంయుక్తంగా నిర్వహించే సీపీగేట్ ప్రవేశపరీక్షల నోటిఫికేషన్‌లు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థుల కోసం హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో ఉచితంగా ఆన్‌లైన్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజిరెడ్డి, కెమిస్ట్రీ విభాగం అధిపతి డాక్టర్ రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. వివరాల కోసం 9866962589 నంబర్‌లో సంప్రదించాలని, జూమ్ ఆన్‌లైన్‌లో నెలరోజులపాటు విషయ నిపుణులతో శిక్షణ ఇస్తామని తెలిపారు.

'అన్యమత ప్రచారం జరగలేదు'

హన్మకొండ కల్చరల్ : వేయిస్తంభాల దేవాలయంలో ఎలాంటి అన్యమతప్రచారం జరగలేదని, సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఈఓ కె.వెంకటయ్య, ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హిందూ దేవాలయాల రక్షణకు చట్టం ఉంటుందని, ధిక్కరించిన వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కేంద్రపురావస్తుశాఖ పరిధిలో ఉన్న కట్టడాలు, దేవాలయాలను టార్గెట్ చేస్తూ కొంతమంది అన్యమత ప్రచారం చేయడం దురదృష్టకరమని తెలిపారు.

మంత్రి హరీశ్‌రావును కలిసిన జూడాలు



ఎంజీఎం: రాష్ట్ర వైద్యశాఖ మంత్రి టి.హరీశ్ రావును మంగళవారం తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు, కేఎంసీ జూనియర్ డాక్టర్స్ కలిశారు. పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. ఇంటర్న్‌లు, పీజీలు, సూపర్ స్పెషాలిటీ రెసిడెంట్స్‌కు 15 శాతం స్టైఫండ్ హైక్‌కి సంబంధించి ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి హరీశ్‌రావు తెలిపారన్నారు. జూనియర్ డాక్టర్ల సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ ప్రమాదాలపై అవగాహన సదస్సు

హన్మకొండ: టీఎస్ ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డివిజన్ పరిధిలోని ఏడీఈలు, ఏఈలు, ఏఏఈలు, సబ్ ఇంజనీర్లు, ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్ ఉద్యోగులు, ఆర్టిజన్‌లకు బుధవారం విద్యుత్ ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు వరంగల్ పోతన రోడ్డులోని మణిదీప్ప గార్డెన్‌లో ఈ సదస్సు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలో గందరగోళం

ఎకనామిక్స్ తెలుగు మీడియం పరీక్ష రద్దు.. 13న మళ్లీ నిర్వహణ

విద్యారణ్యపురి: తెలంగాణ ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షల్లో మంగళవారం జరిగిన ఎకనామిక్స్ సబ్జెక్టులో గందరగోళం నెలకొంది. తెలుగు మీడియం విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం ప్రశ్నపత్రాలను పంపడమే ఇందుకు కారణం. బండిల్స్ కవర్లపై తెలుగు మీడియం అని ఉన్నప్పటికీ అందులో కూడా ఇంగ్లిష్‌మీడియం ప్రశ్నపత్రాలే వచ్చాయి. తెలుగుమీడియం ప్రశ్నపత్రాలు రాలేదని సంబంధిత విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తెలుగులోకి అనువదించి పరీక్షరాయించాలని ఓపెన్ స్కూల్ డైరెక్టర్ ఆదేశించడంతో విద్యార్థులకు ఇంగ్లిష్ ప్రశ్నపత్రాలే ఇచ్చారు. కొందరు విద్యాధికారులు తమకు ఇప్పటికిప్పుడు అనువాదకులు ఎవరు లభిస్తారని, ఇబ్బందికరమేనని తెలియజేయడంతో ఎకనామిక్స్ తెలుగు మీడియం విద్యార్థుల పరీక్ష రద్దు చేస్తున్నామని, ఈనెల 13న మళ్లీ పరీక్ష ఉంటుందని సంబంధిత ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. పరీక్ష ముగిసేంత వరకు విద్యార్థులను కేంద్రాల్లోనే ఉంచారు. హనుమకొండ జిల్లాలో నాలుగు కేంద్రాల్లో 305 మంది ఎకనామిక్స్ తెలుగు మీడియంలో పరీక్ష రాయాల్సింది. ఇంగ్లిష్‌మీడియం విద్యార్థులు 400లమందికిపైగానే ఉన్నారని డీఈఓ ఎండీ అబ్దుల్‌హై, ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ మురాల శంకర్‌రావు తెలియజేశారు. ఈ నెల 13న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఎకనామిక్స్ తెలుగుమీడియం పరీక్ష ఉంటుందని చెప్పారు.

నిలకడగా భూగర్భ జలాలు



- హనుమకొండ జిల్లాలో సగటున 6.96 మీటర్ల లోతులో జలాలు
- అత్యధికంగా ఐనవోలులో 26.20 మీటర్ల లోతుకు పడిపోయిన వైనం
- నడికుడలో పైపైనే.. 1.10 మీటర్లలోతులోనే నీరు

హన్మకొండ: జిల్లాలో భూగర్భ జలాలు నిలకడగానే కనిపిస్తున్నాయి. పంటలు చేతికి రావడంతో భూగర్భ జల వినియోగం తగ్గింది. గత నెలతో పోలిస్తే నిలకడగానే ఉన్నాయి. మార్చి చివరలో జిల్లా సగటు భూగర్భ జలాలు 6.81 మీటర్ల లోతులో ఉండగా, ఏప్రిల్ మాసాంతంలో 6.97 మీటర్ల లోతులోకి చేరాయి. మార్చి, ఏప్రిల్‌కు పెద్ద తేడా కనిపించడం లేదు. జిల్లాలో ప్రాంతాల వారీగా చూస్తే భూగర్భ జలాలు కొన్ని ప్రాంతాల్లో అత్యధిక లోతుకు పడిపోగా, కొన్ని ప్రాంతాల్లో పైపైనే ఉన్నాయి. మార్చి మాసాంతంతో చూసుకుంటే ఏప్రిల్ మాసాంతం నాటికి చాలా గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగాయి. ఐనవోలులో అత్యధికంగా 26.20 మీటర్ల లోతుకు పడిపోగా, నడికుడలో 1.10 మీటర్లలోతులోనే అంటే పైపైనే అందుబాటులో ఉన్నాయి. హనుమకొండ జిల్లాలో 20 ప్రాంతాల్లో భూగర్భజలాల పరిస్థితులను ప్రతి నెలా తెలుసుకోవడానికి 25 ప్రాంతాల్లో బోర్లు వేసి ఫిజో మీటర్లు అమర్చారు. భూమిలో భూగర్భ జలాల హెచ్చుతగ్గులను ఫీజో మీటర్లు రికార్డు చేస్తాయి. ఫీజో మీటర్లలో నమోదైన కొలతలను ప్రతి నెలా చివరి వారాంతంలో తీసుకుని ప్రభుత్వానికి భూగర్భ జలాల పరిస్థితి వివరాలు పంపుతారు. జిల్లాలో వేలేరు మండలం పీచరలో 14.75 మీటర్ల లోతులో, భీమదేవరపల్లి మండలంలో జగన్నాథపురంలో 14.05, వంగరలో 11.60, కొత్తపల్లిలో 9.80, గట్ల సింగాపూర్‌లో 8.60 మీటర్ల లోతుకు భూగర్భజలాలు పడిపోయాయి. వేలేరు మండలంలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. పీచరలో భూగర్భ జలాలు 14.75 మీటర్లకు పడిపోగా, వేలేరులో 6.2 లోతులోనే ఉన్నాయి. ఐనవోలు మండలంలోనూ భిన్నంగా ఉంది. ఐనవోలులో 26.20 మీటర్ల లోతుకు పడిపోతే పంథినిలో 3.17, పున్నేలులో 3.80 మీటర్ల లోతులోనే ఉన్నాయి.

జిల్లాలో భూగర్భ జలాల వివరాలు (మీటర్ల లోతు)...

గ్రామం	మార్చి	ఏప్రిల్
గట్లనర్సింగాపూర్	7.50	8.60
జగన్నాథపూర్	14.10	14.05
కొత్తపల్లి	10.72	9.30
వంగర	11.30	11.60
ధర్మపూర్	6.30	6.30
ధర్మసాగర్	2.40	2.30
పెద్ద పెండ్యాల	8.20	9.80
నారాయణగిరి	8.00	4.95
ఎల్కతుర్తి	8.90	8.80
హనుమకొండ	8.51	6.90
నాగారం	6.50	4.15
సీతంపేట	2.06	2.72
ఎల్లాపూర్	4.40	3.16
ఐనవోలు	16.10	26.20
పున్నేలు	3.17	3.80
పంథిని	2.88	3.17
శనిగరం	2.35	2.56
పీచర	12.00	14.75
వేలేరు	6.20	7.60
ఆత్మకూర్	3.40	2.60
దామెర	3.90	2.60
చెర్లపల్లి	7.90	6.10
నడికుడ	4.10	1.10
పరకాల	5.50	4.50
పత్తిపాక	3.80	4.20

నేటినుంచి మత్స్యగిరి బ్రహ్మోత్సవాలు



శ్రీ మత్స్యగిరి స్వామి ఆలయం

శాయంపేట : మండల కేంద్రంలోని కాకతీయుల కాలంలో నిర్మించిన శ్రీ మత్స్యగిరి స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు బుధవారంనుంచి ప్రారంభంకానున్నాయి. కాకతీయ రాజుల కళా వైభవానికి ప్రతీక నిలిచిన ఈ ఆలయంలో ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధపౌర్ణమి పంచమి రాత్రి ఆగమశాస్త్రం ప్రకారం మత్స్యగిరిస్వామి తిరు కల్యాణ బ్రహ్మోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ. ఉత్సవాలను బుధవారంనుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి తెలిపారు. 3న అధ్యయనోత్సవం, తొలక్కం ప్రారంభం, పుట్ట బంగారం సేవ, ధ్వజారోహణం, గరుడముద్ద, ఎదుర్కోళ్లు, 4న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మత్స్యగిరి స్వామి కల్యాణ మహోత్సవం, మహా అన్నదానకార్యక్రమం, 5న పూర్ణాహుతి, గజవాహన సేన, గుట్టమీదికి పోవడం, 6న రథోత్సవం, అలుక తీరుట, 7న చక్రవర్తి, నాకబలి, నాగవల్లి, పండిత సన్మాన కార్యక్రమాలతో ఉత్సవాలు ముగిస్తాయని వివరించారు.

చికిత్స పొందుతూ సర్పంచ్ మృతి

- ఆర్థిక ఇబ్బందులతో గొడవలు.. పుట్టింటికి వెళ్లిన భార్య
- మనస్తాపంతో సర్పంచ్ ఆత్మహత్య
- హైబోతుపల్లి గ్రామంలో విషాదం

పరకాల: కుటుంబ తగాదాలతో గత నెల29న ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన పరకాల మండలం హైబోతుపల్లి సర్పంచ్ కంచ కుమారస్వామి(25) చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందాడు. పరకాల మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడుగా కొనసాగుతున్న కుమారస్వామి మరణంతో మండలంలో విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. కుమారస్వామి భార్య ఇటీవల ఇంట్లో గొడవపడి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో అతను మనస్తాపానికి గురై గత నెల 29న తన వ్యవసాయ భూమి వద్ద పురుగుల మందు తాగాడు. ఈ విషయాన్ని కుమారుడు శ్రీనాథ్‌కు ఫోన్‌లో తెలపడంతో కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకోగా అప్పటికే అపస్మారక స్థితిలోకి కనిపించాడు. వెంటనే పరకాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మంగళవారం చనిపోయాడు. కుమారస్వామి తల్లి కంచ సాంబలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో గొడవలు

వరంగల్‌లో అడ్తి వ్యాపారం చేస్తున్న సమయంలో ఆర్థికపరమైన ఇబ్బందులు లేని కంచ కుమారస్వామి తన స్వగ్రామంలో సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. సర్పంచ్ అయినప్పటి నుంచి అడ్తి వ్యాపారానికి దూరంగా ఉండడంతోపాటు ఖర్చులు పెరగడంతో ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి. అప్పటినుంచే ఇంట్లో గొడవలు మొదలై చివరకు ప్రాణాలు తీసుకునే దాకా వెళ్లిందని సన్నిహితులు తెలిపారు.

అవినీతి ఎమ్మెల్యేల వివరాలు బహిరంగపర్చాలి

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి



దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న రాజేందర్‌రెడ్డి

హన్మకొండ: దళితబంధులో అవినీతికి పాల్పడిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల వివరాలు బహిరంగ పర్చాలని కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. దళిత బంధు అవినీతి ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద మహాజన సోషలిస్టు పార్టీ, ఎమ్మార్పీఎస్, మాదిగ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షకు నాయిని రాజేందర్‌రెడ్డి సంఘీభావం తెలిపి మాట్లాడారు. దళితబంధులో అవినీతికి పాల్పడిన వారి చిట్టా తన వద్ద ఉందని సీఎం కేసీఆర్ ప్రకటించిన నేపథ్యంలో ఈ కేసును సుమోటోగా హైకోర్టు స్వీకరించాలన్నారు. వివరాలను ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి తెప్పించుకొని గవర్నర్‌కు ఉన్న అధికారాల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ చేస్తున్న పోరాటానికి కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. మహాజన సోషలిస్టు పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంద కుమార్ మాట్లాడుతూ దళితబంధులో అవినీతికి పాల్పడిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పేర్లు బయటపెట్టి, చర్యలు తీసుకోవాలన్న డిమాండ్‌తో ఈ నెల 9వ తేదీ వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగుతాయన్నారు. 10న కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు నల్ల సత్యనారాయణ, ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

లాబోరేటరీల పనితీరుతోనే రోగులకు మెరుగైన సేవలు



ల్యాబ్ టెక్నీషియన్లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డాక్టర్ మోహన్‌దాస్, చంద్రశేఖర్ తదితరులు

ఎంజీఎం: లాబోరేటరీల ఉత్తమ పనితీరుతోనే రోగులకు మెరుగైన సేవలందించవచ్చని కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్ అన్నారు. కేఎంసీ, జిల్లా హెచ్ఐవీ/ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో కాకతీయ మెడికల్ కాలేజీలో మంగళవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో క్వాలిటీ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ అనే అంశంపై ఉత్తమ సేవలందించిన ల్యాబ్ టెక్నీషియన్లకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మోహన్‌దాస్ మాట్లాడుతూ ఎస్ఆర్‌ఎల్‌కు అనుబంధంగా 55 సెంటర్లు ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో ఉన్నాయని తెలిపారు. వీటిలో వరంగల్ నుంచి ఐదు సెంటర్లు రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించి ఫైవ్ స్టార్ రేటింగ్‌తో సర్టిఫికెట్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ అవార్డులకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, టీఎస్ఏసీఎస్ ఏడీ నవీన్‌కుమార్, జనగామ జిల్లా సూపరింటెండెంట్ సుగుణాకర్‌రాజు, నర్సంపేట ఆర్ఎంఓ మనోజ్‌లాల్, డీపీఎం స్వప్న మాధురి, సూపర్‌వైజర్ రామకృష్ణ, స్టాటిస్టికల్ ఆఫీసర్ రమేష్, కమలాకర్ పాల్గొన్నారు.

తరువాత ఎవరు..?

- టాస్క్‌ఫోర్స్ పోలీసుల అదుపులో ఏపీ శ్రీను
- విచారణలో భూ ఆక్రమణదారుల గుట్టు బట్టబయలు

వరంగల్: నగరంలో భూఆక్రమణదారులపై సీపీ ఏవీ రంగనాథ్ కఠిన వైఖరి అవలంబిస్తున్న విషయం తెలిసిందే. వరంగల్ తూర్పు పరిధిలో ఇప్పటికే అధికార కార్పొరేటర్లు ఇద్దరు, ఒక కార్పొరేటర్ భర్తతోపాటు పలువురు నాయకులపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు కేసులు నమోదు చేశారు. తాజాగా రియల్టర్‌గా చలామణి అవుతున్న కాశిబుగ్గకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన నాయకుడు ఏపీ శ్రీనుపై గీసుకొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కావడమే కాకుండా రెండు రోజుల క్రితం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ విచారణలో ఆరుగురు సభ్యుల బృందంతో అక్రమాలకు పాల్పడుతున్నట్లుగా గుర్తించినట్లు తెలిసింది. వీరితోపాటు ప్రస్తుతం అధికారంలో ఉన్న పలువురు కార్పొరేటర్లు, నాయకులు, ఫైనాన్స్, వ్యాపారాల పేరుతో భూదందాలు చేస్తున్న వారి పేర్లను కక్కినట్లు ప్రచారం జరుగుతోంది. కాశిబుగ్గ, చిన్నవడ్డేపల్లి చెరువు, సాయిగణేష్‌కాలనీ, కోటిలింగాలగుడి, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో పలు ప్లాట్లను ఆక్రమించుకుని ఇబ్బందులు పెడుతున్న వారి పేర్లు ఈ జాబితాలో ఉన్నట్లు తెలిసింది. ఇతను తెలిపిన సమాచారం ప్రకారం పూర్తి వివరాలు సేకరించే పనిలో పోలీసులు తలమునకలై ఉన్నట్లు సమాచారం. పూర్తిస్థాయిలో సమాచారం లభించగానే ఆక్రమణలతో సంబంధం ఉన్న ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, ఫైనాన్స్, వ్యాపారులతోపాటు ఇతర వర్గాలకు చెందిన వారిని టాస్క్‌ఫోర్స్ విచారించేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ప్రస్తుతం టాస్క్‌ఫోర్స్ అదుపులో ఉన్న అధికార పార్టీ నాయకుడు ఏపీ శ్రీను గొర్రెకుంటలో 470గజాలు విక్రయించేందుకు డబ్బులు తీసుకుని మోసం చేసిన కేసుపై అదే పార్టీకి చెందిన నాయకుడు ఫిర్యాదు చేయడం విశేషం.

మెరుగైన వైద్య సేవలందించాలి: వరంగల్ కలెక్టర్

కరీమాబాద్: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. గ్రేటర్ పరిధిలోని 42వ డివిజన్ రంగశాయిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని సౌకర్యాలను అడిగి తెలుసుకోవడమే కాకుండా రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానాలకు ఎక్కువగా పేదలే వచ్చే అవకాశమున్న నేపథ్యంలో వారికి సకాలంలో వైద్యం అందించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫణికుమార్, ఆస్పత్రి డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వసూళ్లలో గ్రేటర్!

జీడబ్ల్యూఎంసీలో పెచ్చుమీరుతున్న అవినీతి

- ఏసీబీ దాడులు చేసినా మారని అధికారుల తీరు
- అనుమతులు, పన్నులు, జరిమానాల పేరిట వసూళ్లు
- ప్రైవేట్ వ్యక్తుల ద్వారా సాగుతున్న వసూళ్ల పర్వం
- పూర్తిస్థాయి కమిషనర్ లేకపోవడంతో విచ్చలవిడి
- రోడ్డెక్కుతున్న బాధితులు... ఏసీబీకి ఫిర్యాదుల వెల్లువ



సాక్షిప్రతినిధి, వరంగల్: వరంగల్ మహానగర పాలక సంస్థలో అవినీతి మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. ఇంటి నిర్మాణ అనుమతి నుంచి మొదలు జనన ధ్రువీకరణ పత్రం.. ఇలా ఏది జారీ చేయాలన్నా డబ్బులివ్వాల్సిందే. బల్దియాకు పూర్తిస్థాయి కమిషనర్ లేకపోవడంతో పర్యవేక్షణ కరువై.. అన్ని జోన్లను పాలనాపరంగా నియంత్రించలేకపోతుండడంతో కొంతమంది కిందిస్థాయి అధికారులు సంపాదనపైనే దృష్టి సారిస్తున్నారు. ఫలితంగా అన్ని విభాగాల్లో అవినీతి పెచ్చుమీరిన తీరుపై బాధితులు రోడ్డెక్కుతున్నారు. ప్రజావాణిలో ఫిర్యాదులు చేయడంతోపాటు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులను ఆశ్రయిస్తున్నారు. అడపాదడపా ఏసీబీ అధికారులు దాడులు చేస్తూ అధికారులను పట్టుకుంటున్నా మిగతావారిలో కించిత భయం కనిపించడం లేదు.

అక్రమాల పరంపర ఇలా..

- వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో చెరువుశిఖంలో ఇళ్ల నిర్మాణాలకు అనుమతి ఇచ్చారు. దేశాయిపేట చిన్నవడ్డేపల్లి, రంగశాయిపేట బెస్తం చెరువు, గొర్రెకుంట కట్టమల్లన్న చెరువుల ఫుల్ ట్యాంక్ లెవెల్ (ఎఫ్‌టీఎల్)లో అనుమతులిచ్చారు. హంటర్‌రోడ్‌లో అటవీశాఖ 'జూ' ఎదురుగా ఇద్దరు వ్యక్తుల మధ్య స్థల వివాదం కొనసాగుతుండగానే అనుమతి ఇచ్చారు. పెద్ద ఎత్తున చేతులు మారాయన్న ఫిర్యాదులపై విచారణ జరుగుతోంది.
- వరంగల్ కాశిబుగ్గకు చెందిన ఓ వ్యక్తి (ఆర్టీసీ ఉద్యోగి) 32 రోజుల కింద ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్నా అటువైపు అధికారులు కన్నెత్తిచూడకపోగా 'సార్ కలవమంటున్నడు' అంటూ ఓ ప్రైవేట్ వ్యక్తి పాతిక వేలు డిమాండ్ చేశాడంటూ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు.
- హనుమకొండ హంటర్‌రోడ్ సమీపంలో కమలాపూర్ మండలంలో పనిచేసే ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఇంటి నిర్మాణం, బ్యాంకులోనుకి ఒకేసారి మార్చి నెలాఖరులో దరఖాస్తు చేసుకున్నారు. బ్యాంకు రుణం మంజూరుకు గ్రీన్‌సిగ్నల్ వచ్చినా.. టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారి రూ.30 వేల డిమాండ్‌పై స్పందించని కారణంగా దరఖాస్తు గల్లంతు అయ్యింది. దీంతో సదరు ఉపాధ్యాయుడు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.
- అడిగినంతా లంచం చెల్లిస్తే చాలు వరంగల్ భద్రకాళి నాలా పరిసరాల్లో బఫర్‌జోన్ నిబంధనలు పాటించకుండానే బిల్డింగ్ పర్మిషన్లు జారీ చేశారు.
- ఎల్బీ కళాశాల, ములుగురోడ్, రంగంపేట, హనుమకొండ అలంకార్, కాకతీయ కాలనీల్లో పలు నివాస గృహాలకు ఏదీ పరిశీలించకుండానే అనుమతులు ఇచ్చేశారు.
- భద్రకాళి నాలా విస్తీర్ణం, బఫర్ జోన్ ఎంత అనేది తేల్చకముందే భవన నిర్మాణ అనుమతులు ఇవ్వడం వివాదాస్పదమైన కూడా సదరు అధికారులపై చర్యలు లేవు.
- కాజీపేట బంధం చెరువు దగ్గర ఎఫ్‌టీఎల్ నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణ అనుమతులు జారీ చేశారు.

ప్రైవేట్ వ్యక్తులే మధ్యవర్తులు... కీలకంగా కంప్యూటర్ ఆపరేటర్లు

కాజీపేట, హనుమకొండ సర్కిళ్లలో ఇద్దరు కీలక అధికారులు చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తోంది. ఈ సర్కిళ్లలో పనులు చక్కదిద్దేందుకు ఇద్దరు కిందిస్థాయి అధికారులతోపాటు మరో నలుగురు ప్రైవేట్ వ్యక్తులను వసూళ్ల కోసమే నియమించుకున్నారని స్థానికులు చెబుతున్నారు. నిర్మాణ అనుమతి కావాలంటే ముందు వీరిని కలిసి.. చెప్పిన మొత్తం ఇవ్వాల్సిందే. మధ్యవర్తుల నుంచి కమీషన్ల రూపంలో సదరు వ్యక్తులు భారీగా వసూలు చేస్తున్నారన్న ప్రచారం ఉంది. కాగా జీడబ్ల్యూఎంసీలో టౌన్ ప్లానింగ్ అధికారులు, అదనపు కమిషనర్లు, ఇతర అధికారులు సగానికి పైగా వారి 'డిజిటల్ కీ'ని కంప్యూటర్ ఆపరేటర్లకు ఇచ్చేశారు. దస్త్రాల తయారీ, పరిశీలనపై కొందరికి అవగాహన లేకపోవడం, మరికొందరు నిర్లక్ష్యంగా ఉండటంతో.. కంప్యూటర్ ఆపరేటర్లే వసూళ్ల వ్యవహారాన్ని నడిపిస్తున్నారు. నచ్చినట్లు అనుమతులు, ధ్రువపత్రాలు, ఆదేశాలు జారీ చేస్తున్నారు. హనుమకొండ, కాజీపేట, వరంగల్‌లలో పనిచేసే నలుగురు కంప్యూటర్ ఆపరేటర్లపై అధికంగా ఫిర్యాదులున్నాయి.

- వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో భద్రకాళి చెరువు పరిసరాల్లో ఎఫ్‌టీఎల్ నిబంధనలు పట్టించుకోకుండానే భవన నిర్మాణ అనుమతులు ఇచ్చారు.
- వరంగల్ డాక్టర్స్ కాలనీ, గౌతమినగర్, హనుమాన్ జంక్షన్ ప్రాంతాల్లో, ములుగు రోడ్ కోట చెరువు ఎఫ్‌టీఎల్ నిబంధనలు పట్టించుకోలేదు. వీటన్నింటికీ కారణం పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారడమేనన్న ఫిర్యాదులపై ఏసీబీ గురి పెట్టింది.

పూర్తిస్థాయి కమిషనర్ లేని సమయం చూసి..

బల్దియా కమిషనర్ ప్రావీణ్యకు వరంగల్ కలెక్టర్‌గా పదోన్నతి రావడంతో ఆమె మార్చి 14వ తేదీన రిలీవ్ అయ్యారు. ఆ తరువాత ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించినా జిల్లాపై ఎక్కువగా దృష్టిపెట్టడంతో బల్దియాపై పర్యవేక్షణ తగ్గింది. ఈ సమయం చూసి అధికారులు మరింత రెచ్చిపోతున్నారు. ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న పనులకు డబ్బులు గుంజి అనుమతులు మంజూరు చేస్తున్నట్లు తెలుస్తోంది. పరిస్థితి ఇలానే ఉంటే వారి ఆగడాలకు అడ్డూ అదుపులేకుండా పోతోందన్న చర్చ నడుస్తోంది.

సీఎం కేసీఆర్‌ను కలిసిన మేయర్ సుధారాణి

వరంగల్ అర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును మంగళవారం నూతన సచివాలయంలో వరంగల్ మేయర్ గుండు సుధారాణి మర్యాదపూర్వకంగా కలిశారు. కార్మిక దినోత్సవం (మేడే) సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు అదనంగా రూ.1000 పెంచడంపై మేయర్ సుధారాణి హర్షం వ్యక్తం చేస్తూ గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ తరఫున సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బల్దియాలో సుమారు 3వేల మంది కార్మికులకు లబ్ధి చేకూరుతుందని సీఎంకు ఆమె వివరించారు. సీఎంను కలిసిన వారిలో గుండు విజయరాజ్ ఉన్నారు.

వైద్యుడు.. దేవుడితో సమానం

ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

ధర్మసాగర్: వైద్యుడు దేవుడితో సమానమని, వైద్య వృత్తిలో పనిచేసే వారందరికీ సామాజిక బాధ్యత ఉండాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. మండలంలోని కరుణాపురం గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెండో విడత కంటి వెలుగు శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ఏ ఒక్కరూ కంటి సమస్యలతో బాధపడకూడదనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమం తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కలకోటి అనిల్, మండల వైద్యాధికారి డాక్టర్ గోపినాథ్, కంటి వెలుగు శిబిరం వైద్యాధికారి డాక్టర్ స్వేతా, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు, మల్లక్‌పల్లి సర్పంచ్ మునిగెల రాజు, వైద్యసిబ్బంది, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో కీర్తనకు 'కాంస్యం'

- సత్తాచాటిన సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యార్థిని



పాలకుర్తి టౌన్ : తిరువణ్ణమలై (తమిళనాడు) వేదికగా జరిగిన జాతీయ జూనియర్ ఫెడరేషన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో జనగామ జిల్లా పాలకుర్తి తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్ చదువుతున్న యువ అథ్లెట్ చెరిపెల్లి కీర్తన కాంస్య పతకం సాధించింది. సోమవారం జరిగిన మహిళల 3000 మీటర్ల ఫైనల్ రేసును కీర్తన 11:42:65 సెకన్లలో ముగించి మూడో స్థానంలో నిలిచింది. పాలకుర్తి మండలం గూడూరుకు చెందిన కీర్తన 2019లో దిండి అథ్లెటిక్స్ అకాడమీలో చేరి అంచెలంచెలుగా ఎదిగింది. ఇప్పటికే పలు జాతీయస్థాయి టోర్నీల్లో అద్భుత ప్రదర్శన కనబర్చింది. భవిష్యత్‌లోనూ ఇదే పట్టుదలతో మరిన్ని విజయాలు సాధిస్తా అంటుంది. కీర్తనను పాలకుర్తి గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ అనుమల లక్ష్మి అభినందించారు.

విద్యుదాఘాతంతో 25 గొర్రెలు మృతి

మరిపెడ రూరల్ : విద్యుదాఘాతంతో 25 గొర్రెలు మృతి చెందగా, మరికొన్ని కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం తానంచర్లలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. తానంచర్లకు చెందిన గొర్రెల కాపరి ఈర్ల గంగాధర్ తన కున్న 90 గొర్రెలను ఇంటి వెనకాల ఉన్న దొడ్డిలో తోలి దాని ఎదుట కాపలా పడుకుంటాడు. సోమవారం రాత్రి మబ్బులు పట్టి ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురు గాలులు వీయడంతో కాపరి ఇంట్లోకి వెళ్లి పడుకున్నాడు. ఈ క్రమంలో ఓ కుక్క దొడ్డి ముందుకు రావడంతో గొర్రెలు బెదిరిపోయి గోడ దూకేందుకు ప్రయత్నించాయి. దూకే ప్రయత్నంలో దొడ్డిపై నుంచి ఉన్న మరో ఇంటి విద్యుత్ సర్వీసు తీగలు తెగిపోయి గొర్రెలమందపై పడింది. విద్యుత్‌షాక్ గురైన 25 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మృతి చెందిన 25 గొర్రెల విలువ సుమారు రూ.2.50 లక్షలు ఉంటుందని బాధితుడు బోరునవిలపించాడు. ప్రభుత్వం తన కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

మూడు నియోజకవర్గాలకు టీటీడీపీ కో-ఆర్డినేటర్లు

సాక్షి, హైదరాబాద్: మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని 3 అసెంబ్లీ నియోజకవర్గాలకు టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ కో–ఆర్డినేటర్లను నియమించారు. భద్రాచలం(ఎస్టీ)కి ఈసం శశిధర్, ఇల్లెందు (ఎస్టీ)కి ముద్రగడ వంశీ, నర్సంపేటకు అడపా నర్సింగరావుని నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పోలీస్‌శాఖలో విషాదఛాయలు



ఇంద్రయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ



మార్చురీ వద్ద రోదిస్తున్న డ్రైవర్ భార్య రాజేశ్వరి



రోదిస్తున్న ఎస్సై భార్య ఎలిషా, కుమారుడు

- ఎస్కార్టుగా వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎస్సై, డ్రైవర్
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఐజీ, ఎస్పీ

ఏటూరునాగారం : ఎస్కార్టుగా వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఏటూరునాగారం పోలీస్‌స్టేషన్‌లో సెకండ్ ఎస్సైగా పనిచేస్తున్న బండారి ఇంద్రయ్య, ప్రైవేటు డ్రైవర్ మృతి చెందడంతో పోలీసుల శాఖలో విషాద ఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న ఏజెన్సీ గ్రామాల పర్యటనలో ఉన్న ఐజీ రవివర్మ, ఎస్పీ గాష్ ఆలం జీడివాగుకు చేరుకొని మృతదేహాలను పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. అనంతరం ఎస్పీ, ఏఎస్పీ సంకీర్త్, ములుగు డీఎస్పీ రవీందర్, స్థానిక సీఐ రాజు, తాడ్వాయి, మంగపేట, ఏటూరునాగారం ఎస్సైలు వెంకటేశ్వర్లు, తాహెర్‌బాబా, రమేష్ మార్చురి గదికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. ఎస్సై కుటుంబాన్ని ఓదార్చారు. మార్చురి వద్ద పెద్ద ఎత్తున పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అలాగే పోలీస్‌స్టేషన్‌లో సహ ఉద్యోగులు, మహిళా కానిస్టేబుళ్లు కన్నీరుమున్నీరుగా విలపించారు.

1984 బ్యాచ్ కానిస్టేబుల్ ఇంద్రయ్య

హనుమకొండ మండలం పలివేల్పులకు చెందిన బండారి ఇంద్రయ్య 1984లో తొలిపోస్టింగ్ నల్లబెల్లి స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా ఉద్యోగం పొందాడు. 2019లో మహబూబాబాద్ టౌన్ ఎస్సైగా ప్రమోషన్ వచ్చింది. అక్కడ విధులు నిర్వర్తిస్తూ మహబూబాబాద్ కోర్టు లైజనింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తూ 2021 డిసెంబర్‌లో 317 జీఓలో జరిగిన బదిలీలపై ఏటూరునాగారం సెకండ్ ఎస్సైగా వచ్చారు. ఇంద్రయ్యకు భార్య ఎలిషా, నలుగురు కుమారులు అవినాష్, అన్వేష్, అఖిలేష్, నిఖిలేష్ ఉన్నారు. భార్యతో ఇంద్రయ్య ఇక్కడే ఉంటుండగా వారి కుమారులు పలివేల్పులలో నివాసం ఉంటున్నారు. వారు గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్నారు.

స్నేహితుడితో వచ్చి అనంతలోకాలకు..

తాడ్వాయి మండలం కాటాపురం గ్రామానికి చెందిన జేసీబీ డ్రైవర్, వ్యవసాయదారుడు చెట్టుపల్లి రాజు(23) తన స్నేహితుడి వంశీతో కలిసి ఏటూరునాగారానికి వచ్చాడు. ఈ క్రమంలో ఎస్సై ఇంద్రయ్యకు డ్రైవర్ అవసరం ఉండగా రాజుకు డ్రైవింగ్ వస్తుందని తీసుకెళ్లారు. ఈ క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజు మృతి చెందాడు. రాజుకు భార్య రాజేశ్వరి, కుమార్తె ఐశ్వర్య, కుమారులు రేవంత్, జున్ను ఉన్నారు. తన భర్త ఇప్పుడే వస్తానని చెప్పి పరలోకానికి వెళ్లాడని భార్య రోదనలు మిన్నంటాయి. అభం శుభం తెలియని చిన్నారులు తండ్రిని కోల్పోయి దిక్కులేని వారిగా మారారని కుటుంబ సభ్యులు గుండెలు అవిసేలా రోదించారు.

తాళం పగులగొట్టిన రాజు కుటుంబీకులు

ఎస్సై ఇంద్రయ్య వాహనం నడుపుతూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ప్రైవేటు డ్రైవర్ రాజు మృతి చెందడంతో పోలీసులు ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించి మార్చురీలో భద్రపర్చారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు మార్చురీ వద్దకు ఆర్తనాదాలతో రావడంతో గదికి తాళం వేసి కనిపించింది. దీంతో ఆవేదనకు గురైన కుటుంబ సభ్యులు తాళం పగులగొట్టి ఫ్రీజర్‌లో ఉన్న రాజు మృతదేహాన్ని బయటకు తీసి రోధించారు. మార్చురి వద్ద ఉద్రిక్తత ఉంటుందని డీఎస్పీ రవీందర్ అక్కడికి చేరుకొని పరిస్థితిని చక్కదిద్దారు. మృతుడు రాజు భార్య రాజేశ్వరిని డీఎస్పీ ఓదార్చారు. అనంతరం ఏటూరునాగారం పోలీస్‌స్టేషన్‌కు రాజుతో కలిసి వచ్చిన స్నేహితులతో డీఎస్పీ మాట్లాడి వివరాలను సేకరించారు.

రాజు కుటుంబాన్ని ఆదుకుంటాం : ఎస్పీ

పోలీసువాహనం నడుపుతూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చెట్టుపల్లి రాజు కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని జిల్లా ఎస్పీ గాష్ ఆలం హామీ ఇచ్చారు. మంగళవారం రాత్రి ఏటూరునాగారం మార్చురీకి వచ్చిన ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడారు. రాజు భార్యకు ఉద్యోగం, పిల్లలకు చదువు, రూ. 2లక్షల నగదు ఇస్తామన్నారు. తక్షణ సాయం కింద రూ. 50వేలను అందజేశారు.

వర్ష బాధిత రైతులను ఆదుకుంటాం



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి దయాకర్ రావు

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి

దేవరుప్పుల : అకాల వర్షం, వడగళ్ల వానతో నష్టపోయిన రైతాంగాన్ని అన్ని విధాలుగా ప్రభుత్వపరంగా ఆదుకుంటామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు భరోసా ఇచ్చారు. మంగళవారం మండలంలోని సీతారాంపురంలో తడిసిన ధాన్యం కల్లాలను ఆయన పరిశీలించి రైతులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం కార్పొరేటీకరణ వ్యవసాయ రంగాభివృద్ధికి పాటుపడుతున్న తరుణంలో ఆర్థిక భారంతో సీఎం కేసీఆర్ అన్నదాతలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేస్తున్నారన్నారు. గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని లోతట్టు ప్రాంతంలో పెట్టడంపై సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు ఇబ్బందులు లేకుండా సత్వర చర్యలు చేపడుతూ ధాన్యం రైస్‌మిల్లులకు తరలించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీపీ బస్వ సావిత్రి మల్లేశం, సర్పంచ్ రెడ్డిరాజుల రమేష్, పైండ్ల రవి, వెంకన్న,రవి, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

అకాల వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు



మాట్లాడుతున్న సీఎండీ గోపాల్ రావు

హన్మకొండ: అకాల వర్షాలపై అధికారులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు సూచించారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో సీజీఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సీజీఎంల వారీగా ఆయన ప్రగతిని సమీక్షించి మాట్లాడుతూ అకాల వర్షం, ఈదురుగాలులకు ఉత్పన్నమైన సమస్యలను గుర్తించి వాటిని వెంటనే మరమ్మతు చేయాలన్నారు. తెగిపోయిన లైన్లు, విరిగిన విద్యుత్ స్తంభాలను మార్చి లైన్‌ను పునరుద్ధరించాలని సూచించారు. దత్తత తీసుకున్న గ్రామాల్లో పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆర్థికేతర పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. సిబ్బంది ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్రేక్ డౌన్స్, ట్రిప్పింగ్స్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విధిగా పనిచేసే చోట నివాసముండాలన్నారు. అన్ని కార్యాలయాల్లో పౌర సేవ పత్రములు, టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. రెవెన్యూ వసూళ్లు వంద శాతం సాధించాలన్నారు. రూ.50 వేలు పైబడిన రాని బకాయిలను వసూలు చేయాలన్నారు. సమావేశంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వర్‌రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, పి.మోహన్‌రెడ్డి, వి.తిరుపతి రెడ్డి, సీజీఎంలు బి.అశోక్ కుమార్, వి.మోహన్ రావు, కె. కిషన్, కె.ఎస్.గుట్ట, రాజు చౌహాన్, సి.ప్రభాకర్, భీకంసింగ్, రవీంద్రనాథ్, జాయింట్ సెక్రటరి కె.రమేష్, కంపెనీ కార్యదర్శి కె.వెంకటేశం పాల్గొన్నారు.

శ్రీనివాస్‌రెడ్డిని అభినందించిన సీఎండీ

జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని రైతులకు ఉచితంగా కెపాసిటర్లు పంపిణీ చేసిన పారిశ్రామికవేత్త చల్ల శ్రీనివాస్‌రెడ్డిని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, ఎండీ అన్నమనేని గోపాల్‌రావు మంగళవారం స్వయంగా ఫోన్ చేసి అభినందించారు. రైతులకు మేలు చేసేందుకు ఇప్పటి వరకు 1200 కెపాసిటర్లు పంపిణీతో పాటు మరో 1800 కెపాసిటర్లు పంపిణీ చేసేందుకు ముందుకు రావడం గర్వకారణమన్నారు.

కార్మికుల సంక్షేమమే ధ్యేయం

- రైల్వే మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ శంకర్‌రావు
- ఘనంగా గోల్డెన్ జూబ్లీ వేడుకలు



మాట్లాడుతున్న రైల్వే మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ శంకర్‌రావు

కాజీపేట రూరల్ : రైల్వే కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా రైల్వే మజ్దూర్ యూనియన్ నిరంతరం కార్మికుల పక్షాన కృషి చేస్తుందని మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ జోన్ జనరల్ సెక్రటరీ సీహెచ్.శంకర్‌రావు అన్నారు. కాజీపేట రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో మంగళవారం డీజిల్ లోకో షెడ్ మజ్దూర్ యూనియన్ బ్రాంచి గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు, మే డే వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి శంకర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు, ప్రైవేటీకరణ, నూతన పెన్షన్ స్కీం విధానాలు అవలంభిస్తుందని భవిష్యత్‌లో కలిసికట్టుగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. డీజిల్‌షెడ్ మజ్దూర్ యూనియన్ బ్రాంచి గోల్డెన్ జూబ్లీ వేడుకలు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. 1973 నుంచి నేటి వరకు మజ్దూర్ యూనియన్ డీజిల్ బ్రాంచీ కార్యదర్శులు, చైర్మన్లుగా సేవలందించిన సీనియర్ కామ్రేడ్‌లను పూలమాలలు, శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ హరిబాబు, మజ్దూర్ యూనియన్ నాయకులు కె.శ్రీనివాస్, పి.రవీందర్, వరప్రసాద్, నాయిని సదానందం, వేదప్రకాష్, ఆర్.శ్రీనివాస్ నాయక్, కె.శ్యామ్, ఎస్ఆర్‌వి.రావు, ఎ.శ్రీనివాస్, ఆర్.సుధాకర్, రవీందర్, శ్రీనివాస్ యాదవ్, ఎస్‌కె.జానీ, బిక్షపతి, గిరిమిట్ల రాజేశ్వర్, రవికిరణ్, ప్రదీప్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఐవీ స్టాండ్, వీల్‌చైర్లు లేక ఇలా..



ఎంజీఎం : వరంగల్ ఎంజీఎం ఎమర్జెన్సీ డిపార్ట్‌మెంట్‌లోని ఎముకల విభాగం వద్ద ఐవీ స్టాండ్, వీల్‌చైర్ లేక రోగులు ఇబ్బందులు పడుతుండడంతో రోగి బంధువులే ఇలా సెలైన్ బాటిల్‌ను పైకెత్తి పట్టుకోవడం మంగళవారం కనిపించింది.

రేపు క్రీస్తుజ్యోతి ప్రార్థనా మందిరం ప్రారంభం



మాట్లాడుతున్న పాల్సన్‌రాజ్

ధర్మసాగర్ : మండలంలోని కరుణాపురంలో నూతనంగా నిర్మించిన క్రీస్తుజ్యోతి ప్రార్థనా మందిరాన్ని ఈ నెల 4న ప్రారంభించనున్నట్లు ఫాదర్ డాక్టర్ పాల్సన్‌రాజ్, ఫాదర్ జయప్రకాష్ గోపు తెలిపారు. మంగళవారం వారు చర్చిలో విలేకర్లతో మాట్లాడుతూ కరుణాపురంలో నిర్మించిన క్రీస్తుజ్యోతి ప్రార్థనా మందిరం ఆసియాలోనే అతి పెద్దదని, ఈ మందిరంలో ఒకేసారి వేలాది మంది విశ్వాసులు ప్రార్థనలు చేసుకోవచ్చునని చెప్పారు. కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరవుతున్నట్లు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది విశ్వాసులు రానున్నట్లు పేర్కొన్నారు దేవుని మందిరాన్ని నిర్మించడం చాలా ఆనందంగా ఉందని, ఇది మా అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు.

'హై సెక్యూరిటీ'తోనే భద్రత

- నంబర్ ప్లేట్‌తో ఎన్నో ప్రయోజనాలు
- నంబర్ లేని వాహనాలతో అసాంఘిక కార్యక్రమాలు
- ఆన్‌లైన్‌లో నంబర్ ప్లేట్‌ను తిరిగి పొందొచ్చు



షోరూంలో వృథాగా పడి ఉన్న హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్లు

ఖిలావరంగల్ : వాహనం ఏదైనా నంబర్లను ఇష్టమైన రీతిలో ముద్రించుకుంటా మంటే ఇకపై కదరదు. వాహనానికి తప్పనిసరిగా నంబర్ ప్లేట్ ఉండాల్సిందే. రవాణాశాఖలో వివిధ సేవలకు వచ్చే వాహనదారులు హై సెక్యూరిటీ నంబరు ప్లేట్ ఉంటేనే కార్యాలయాల్లోకి అనుమతిస్తామని రవాణాశాఖ స్పష్టం చేస్తుంది. వాహనానికి ఫిట్‌నెస్, రీ రిజిస్ట్రేషన్ చేయాలంటే నంబర్‌ప్లేట్‌ను పరిగణలోకి తీసుకుని అనుమతిస్తున్నారు.


లక్షల్లో వాహనాలు..వేలల్లో హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్

రవాణాశాఖ ప్రతిష్టాత్మకంగా హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్లను తెచ్చింది. ఏదైనా ఘటన జరిగితే అక్షరాలను సులభంగా గుర్తించేలా హైసెక్యూరిటీ నంబర్‌ప్లేట్‌ను ఆరేళ్ల క్రితం ప్రవేశ పెట్టారు. కానీ నేటికి ఆచరణలో మాత్రం అంతంత మాత్రమే కనిపిస్తోంది. వరంగల్ జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల వాహనాలు సుమారు 3.50 లక్షపైగా ఉన్నాయి. అందులో ద్విచక్రవాహనాలు 2 లక్షలకు పైగా ఉన్నాయి. అందులో పది శాతం కూడా హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్ కనిపించడం లేదు. షోరూంలో కొనుగోలు చేసి వాహనానికి ఆర్టీఏ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కాగానే వాహనానికి షోరూం తీసుకెళ్తే నంబర్‌ప్లేట్‌ను బిగిస్తున్నారు. వాహనం బయటకు రాగానే హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్‌ను తొలగించి వాహనచోదకులు తమకు నచ్చినరీతిలో పేర్లు పెట్టడం, అభిమానుల ఫొటోలు ముద్రించి ప్లేటును బిగిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. వీటిపై అధికారులు దృష్టి సారించారు.

మూలుగుతున్న హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్స్

కొత్తవాహనం కొన్న వారికి ఆయా వాహన షోరూంల్లోనే వాహనానికి హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ బిగిస్తున్నారు. పాత వాహనదారులు ఆన్‌లైన్‌లో రుసుము చెల్లించి హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ పొందొచ్చు. ఈ అవకాశం ఉన్నా వాహనచోదకులు వినియోగించుకోవటం లేదు. నంబర్ ప్లేటుతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. షోరూంల్లో హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్లు మూలుగుతున్నాయి. వాహనచోదకులు నంబర్‌ప్లేట్లపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. వరంగల్ నగరంలో ఇటీవల అసాంఘిక కా ర్యకలాపాలు ఎక్కువయ్యాయి.అంతేకాదు కొందరు ఆకతాయిలు వాహనం దొంగిలించి, నంబర్ ప్లేట్‌ను మార్చేసి, గంజాయి, ఇతర అక్రమాలకు ఉపయోగిస్తున్నట్లు సమాచారం. అంతేకాదు నకిలీ పత్రాలను సృష్టించి వాహనం అమ్మేస్తున్నారు. హైసెక్యూరిటీ వాహనానికి ఉంటే ఇవన్నీ ఆటలు సాగవని అధికారులు చెబుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



ఆర్టీఏ కార్యాలయానికి రీ రిజిస్ట్రేషన్, యాజమాని పేరు మార్పు,ఎఫ్‌సీ తదితర సేవలకు వచ్చే వాహనాలకు హైసెక్యూరిటీ నంబర్‌ప్లేట్ ఉండాలని సూచిస్తున్నాం. నంబర్‌ప్లేట్ లేకుంటే రీ రిజిస్ట్రేషన్ల నిలిపేస్తున్నాం. చోరీ గురైన వాహనాన్ని సైతం సులభంగా గుర్తించే అవకాశం ఉంటుందని చెబుతున్నాం. నంబర్‌ప్లేట్ లేకుంటే వాహనాన్ని సీజ్ చేసి కేసులు నమోదు చేస్తున్నాం.

– వెంకన్న, ఎంవీఐ, వరంగల్ ఆర్టీఏ

పాడితో బహుళ ప్రయోజనాలు

- పశువుల పెంపకంతో రైతులకు జీవనోపాధి
- పాలతో పాటు పేడకు మంచి డిమాండ్
- ఆసక్తి చూపుతున్న రైతులు



కాజీపేట శివారులో పెంచుతున్న పాడి

కాజీపేట: పాడి పశువుల పెంపకంతో రైతులకు ఆర్థిక అవసరాలు తీరడంతో పాటు బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. వెనుకటి రోజుల్లో పాడి ఆవులు, గేదెలు లేని ఇళ్లు ఉండేది కాదంటే అతిశయోక్తి లేదు. ఏ ఇంట్లో చూసినా పాడి పశువులతో కొట్టాలు కళకళలాడుతుండేవి. నేడు ఆ పరిస్థితి తగ్గిపోయింది. అయినప్పటికీ ప్రస్తుత పరిస్థితుల్లో పాలతో పాటు పశువుల నుంచి వచ్చే ప్రతిదానికి కొంత ఆదాయం వస్తుంది. పశువుల పెంపకంపై దృష్టి సారిస్తే జీవనోపాధికి ఢోకా ఉండదు.



పేడతో వర్మికంపోస్టు...

ఒక పశువు పేడతో సుమారు మూడు టన్నుల వర్మికంపోస్టు ఉత్పత్తి అవుతుంది. దీంతో పేడ కంటే మూడొంతుల ఆదాయం వస్తుంది. అతితక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలను ఆర్జించడానికి అవకాశం ఉంది. వీటిలో ఒక షెడ్డు, అందులో తొట్టెలు నిర్మించాలి. అడుగున పచ్చి పేడతో నింపాలి. కొబ్బరి పీచును రెండు నుంచి నాలుగు అంగుళాల మందం కలపాలి. పశువుల పేడ, ఎండిన ఆకులు, వృథా కూరగాయలు మొదలైనవి కుప్పలుగా పోసి పాక్షికంగా కుళ్లనివ్వాలి. ఆ తర్వాత పేడను రెండు అంగుళాల మందంతో పర్చి ఒక చదరపు మీటరుకు 1000 వానపాములు వదలాలి. రోజు గోనె సంచులను కప్పి నీళ్లు చల్లుతుంటే ప్రతి ఆరు, ఏడు వారాలకోసారి వర్మికంపోస్టు దిగుబడి పొందవచ్చు.

బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేసుకోవచ్చు...

పశువుల 25 కిలోల పేడతో 500 గ్రాముల ఎల్పీజీకి సమానమైన బయోగ్యాస్ లభిస్తోంది. 5 నుంచి 8 పాడి పశువుల పేడతో ఉత్పత్తి అయ్యే గ్యాస్ 7–9 మందికి ఒకరోజు వంటకు సరిపోతుంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు పశువుల పేడతో పిడకలు తయారు చేసి వంట చెరుకుతో పాటు దీన్ని ఉపయోగిస్తారు.

సేంద్రియ ఎరువుగా...

పశువుల పేడలో 0.30 శాతం నత్రజని, 0.18శాతం భాస్వరం, 0.18 శాతం పొటాష్, 0.36 శాతం సున్నం మొదలగు పోషకాలుంటాయి. ప్రతి పశువు నుంచి ఏటా 4 మెట్రిక్ టన్నుల పేడ లభిస్తోంది. దీనిని ఎరువుగా వాడడంతో యూరియా, సింగిల్ సూపర్ పాస్పేట్, న్యూరేట్ ఆఫ్ పొటాష్‌లకు సరితూగే పోషకాలు లభించి ఖర్చులు తగ్గుతాయి. సేంద్రియ వ్యవసాయం పశుపోషణలో ఉపయోగపడ్తుంది. పొలాల్లో పశువుల పేడ ఎరువుగా ఉపయోగపడ్తుంది. భూమి సారవంతంగా మారడంతో పాటు దిగుబడులు పెరుగుతాయి.



పశువుల పేడను పోగు చేసిన రైతులు

పశు శక్తి...

వెనుకటి రోజుల్లో పాడి పశువులేనిది రైతుకు అడుగు ముందుకు పడేది కాదు. ప్రతి ఇంటిలో ఓ పాడి పశువు ఉండి తీరాల్సిందే. ట్రాక్టర్ల వంటి మిషన్ల రావడంతో పాడి పశువులు నేడు కనుమరుగయ్యాయి.

పాల ఉత్పత్తితో ఆదాయం...

పాడి పశువుల పెంపకంతో పాటు ద్రవరూపంలో మార్కెటింగ్ చేసుకోవడం వల్ల ఆదాయం లభించడం సాధారణం. కానీ పాల పదార్థాలుగా తయారు చేసుకొని అమ్ముకుంటే ఎన్నో రేట్లు ఆదాయం లభిస్తుంది. పాల ద్వారా నికర లాభం 8 నుంచి 10 శాతం లభిస్తే, నెయ్యి ద్వారా 6 శాతం లభిస్తుంది. పెరుగు, పన్నీరు, కోవ, బర్ఫీ, శ్రీఖండ్ వంటి పాల ఉత్పత్తుల్లో 15 నుంచి 20 శాతం నికర ఆదాయం వస్తుంది. ప్రస్తుత రోజుల్లో పాల అమ్మకంతో చాలా లాభాలున్నాయి. వీటితో ఎన్నో కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయి.

పశువుల మూత్రం ఔషధం..

పశుమూత్రంలో 1.21 శాతం నత్రజని, 1.01 శాతం భాస్వరం, 1.35 శాతం పొటాష్, 10.01 శాతం సున్నం మొదలగు పోషకాలు ఉంటాయి. ప్రతి పశువు నుంచి ఏటా సుమారు 3 వేల లీటర్ల మూత్రం లభిస్తుంది. ఈ మూత్రాన్ని చెట్ల అభివృద్ధి పారించవచ్చు. ముఖ్యంగా దేశవాళి ఆవుల మూత్రం ఆయుర్వేద వైద్యా విధానంలో మంచి డిమాండ్ కలిగి ఉంది.

ఔషధగుణంగా ఆవు పేడ...

ఆవు పేడలో 16 రకాల ఖనిజ లవణాలున్నాయి. పేడతో పాటు గో మూత్రాన్ని ఆయుర్వేద వైద్యులు సుమారు 32 రకాల ఔషధాల్లో వినియోగిస్తున్నారు. దేశ వాళి ఆవు పేడకు ప్రస్తుత మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది.